


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

## - 12-

రోజూ ఆ పాటికి ఒళ్ళు తెలియకుండా పడుకునే నాగరాజు తండ్రి శ్రీనివాసులు, ఆ రోజు మేలుకునే ఉన్నాడు అతను వెళ్ళేసరికి. అతని వంటి మీద దెబ్బలని చూసి అల్లాడి పోయాడు శ్రీనివాసులు. తండ్రికి జరిగింది చెప్పక తప్పలేదు నాగరాజుకు.

"ఒరేయ్ నాగా, పార్వతీశం గారంటే... కొంపదీసి...?" ఆరాగా అన్నాడు శ్రీనివాసులు కొడుకుతో. అవునన్నట్టు తలూపాడు నాగరాజు. చాచి పెట్టి అతని గూబ మీద కొట్టాడు శ్రీనివాసులు.

"ఏం పరాసికాలాడుతున్నా వేట్రా? వారెక్కడ? మన మెక్కడ? వారి పిల్లని పేవించట మేట్రా? నీ కేవన్నా పిచ్చా? పెల్లాడేద్దామనే!" తండ్రి కొట్టిన దెబ్బకి కళ్ళు తిరిగాయి నాగరాజుకు.

"నేను కాదెహే, వాళ్ళ అమ్మాయే మనం పెళ్ళి చేసుకుందామని నన్నడిగింది."

"అయితే మటుకు? నీ బుద్దేమయ్యిందిరా ఎదవ నాయాలా? ఆయన సొతంత్రం కోసం జైలు కెళ్లిన మడిసి. మీ అయ్య జేబులు కొట్టి జైలు కెళ్ళే బాపతు. ఆరు కోప్పడ్డారనే ఆ కత్తెర వొదిలేసి ఈ కత్తెర అట్టుకుంది. నీకో ఇసయం తెలుసా? ఆరు దయ తలచి ఇచ్చిందే ఈ చోటు. ఈడ గుడిసేసుకుని బతుకుతున్నాం మనవందరం. వందల ఎకరాల ఆసామి ఆయన. ఆరికీ మనకీ సాపత్యమేటి? ఇంకోసారీ ఊసెత్తి నావంటే పాతి పెట్టీగల్ను." కొడుకుని గట్టిగా మందలించి అక్కడనించి విసవిసా వెళ్ళాడు శ్రీనివాసులు.

"ఒసేయ్, ఎక్కడ సచ్చావు? ఈ నా కొడుకు సేసిన పని యిన్నావా?" పక్కింటి ఎంకటి తో ఊసులాడుతున్న అలిమేలు ఒక్క పరుగున వచ్చింది

"ఏటైనాది? ఎందుకా అరుపులు?" అంటూ.

కొడుకు దెబ్బలు చూసి అలిమేలు శోకండాలు పెడుతూ వేడినీళ్ల కాపడం పెట్టటం మొదలు పెట్టింది. శ్రీనివాసులు పెద్ద గొంతుతో కొడుకుని తిట్టటం మొదలు పెట్టాడు.

"నీ బుద్ది బుగ్గి గాను. ఆ పెద్దింటి పిల్ల జోలికి ఎందుకు పొయ్యావురా?" అతని తిట్లు విని చుట్టుపక్కల వారంతా చేరారు. ఏం జరిగిందని అడిగిన వారికీ, అడగని వారికీ తన కొడుకుని పార్వతీశం మనుషులు ఎట్లా కొట్టింది వర్ణించి చెప్పింది అలిమేలు. జరిగిన దానికి అందరూ ఒకేలా స్పందించరు కదా! గుంపులోంచి ఒక ముసలోడు అన్నాడు.

"ఇదన్నాయం. పెద్దోళ్ళ కొక నీతి, పేదోళ్ళ కొకటా? నీతులు సెప్పేటందుకేనా? ‘మొగుడు పోయిన దానికి మారు మనువు సెయ్యాల, ఆడోల్లు సదూకోవాలా, కులం, మతం అన్నీ మనం బెట్టుకున్నయే. అయేయి నిజానికి లేవు’ అంటూ తెగ ఉప్పన్నాసాలు ఇత్తాదుగా ఆ సామి. ఈనాడు ఆ పిల్లని మనోడి కియ్యటానికి ఏటి అడ్డు?"

ఇది అందరికీ నచ్చింది. అందరిలో వేడి పుట్టింది. అందరికీ ముసలోడు అన్నది నిజమే అనిపించింది. వాళ్ళు అలా రెచ్చగొట్టకపోతే ఆ విషయం అక్కడే ఆగేదేమో! తండ్రి హితబోధతో బుద్ధివచ్చేదేమో నాగరాజుకు. కానీ అలా కాలేదు. కులపెద్దలు అందరూ కలిసి తెల్లవారాక వెళ్ళి పార్వతీశాన్ని నిలదీయాలని నిర్ణయం అయ్యింది.

మర్నాడు ముకుందం వాళ్ళు కొట్టిన దెబ్బలకు కట్లు కట్టించి, నాగరాజుని వెంటబెట్టుకుని వాడ పెద్దలంతా పార్వతీశం ఇంటికి వెళ్ళారు. అప్పుడే పొద్దుటి ఫలహారం ముగించి వార్తా పత్రిక చదువుతున్నాడు పార్వతీశం. హరిజనవాడ నాయకులంతా కలిసి రావటంతోనే ఏదో సమస్య ఉన్నదని అర్ధమయ్యింది ఆయనకు.

"రండిరండి, ఏంటి అందరూ కూడగట్టుకుని వచ్చారు? ఈ అబ్బాయికి ఈ దెబ్బలేంటీ?" ఆదరంగా పలకరించాడు వారిని. ఆయన మంచితనం చూడగానే వారిలో ఆవేశం చప్పగా చల్లారి పోయింది.

"అయ్యా, నమస్కారవండీ. తమతో సిన్న ఇసయం మనవి సేసుకుందామనీ" నసిగాడు రాత్రి ఊంకెలు వేసిన పెద్ద మనిషి.

"చెప్పవయ్యా, నీకు అడ్డేమిటి?" ప్రోత్సహించాడు పార్వతీశం. ఒకేసారి వచ్చిన అంతమంది వాడ జనాన్ని చూసి ఏమయ్యిందోనని అక్కడకు వచ్చింది శయనమ్మ. డాబా పైనుంచి నాగరాజుని చూసి ఒక్క పరుగున గుమ్మం దాకా వచ్చిన రాజేశ్వరి అతని ఒంటిమీది దెబ్బలని చూసి బిత్తర పోయింది. కోరగా తనవైపు చూస్తున్న పెద్దన్న గారిని చూడగానే ఆమె జరిగింది అర్థం చేసుకుంది. ఆమెకు దెబ్బలు తాకి ఉబ్బిన నాగరాజు మొహం చూసి కన్నీళ్లు ఆగలేదు. ఆవేశం పెల్లుబికింది. నాగరాజు ఏం చేశాడని అంతగా కొట్టారు? తప్పంటూ ఉంటే అది తనది. ఆమెకు నాగరాజు మీద ఉన్న ప్రేమ పది రెట్లయ్యింది. పార్వతీశం మాటలతో ధైర్యం తెచ్చుకున్నాడు ఆ ముసలివాడు.

“నిన్న సందేళ తమరి ఇంటి మగపిల్లలు మా నాగరాజుని ఇలా కొట్టేశారయ్య. తమరే నాయం సెప్పాల." ముందు ఆశ్చర్య పోయాడు పార్వతీశం. ఆనక అక్కడే వుండి అది అబద్ధమని అనని ముకుందాన్ని, మురారిని చూసి ఆయనలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.

"ఏరా? ఎందుకు కొట్టాల్సి వచ్చింది?" గర్జించాడు పార్వతీశం. విషయం అందాకా వస్తుందని నలుగురూ అనుకోలేదు. ఆయన ప్రశ్నకు సమాధానం ఏమివ్వాలో కూడా వారికి తెలియలేదు. రెండు తగలనిచ్చి, హెచ్చరిస్తే

నాగరాజు భయపడి పోయి రాజేశ్వరిని కన్నెత్తి చూడడని అనుకున్నారు కానీ, ఇలా మందిని ఇంటి మీదకి వేసుకొచ్చి, తగవు తెస్తాడనుకోలేదు వాళ్ళు. దానితో ఏమీ జవాబివ్వలేక చేతులు కట్టుకుని మౌనంగా నిల్చున్నారు.

"అయ్యా, తమరు సరేనంటే జరిగింది నేను సెప్తాను" శ్రీనివాసులు ముందుకొచ్చి అన్నాడు. హరిజనవాడలో ఏ అభివృద్ధి కార్యక్రమం తలపెట్టినా ముందు ఉండి, అందరిని ప్రోత్సహించి ఆ కార్యక్రమం విజయవంతమయ్యేలా చూసే శ్రీనివాసులంటే పార్వతీశంకి అభిమానం.

"చెప్పవయ్యా శ్రీనివాసులు" అన్నాడు ఆదరంగా. శ్రీనివాసులు భయపడుతూ, భయపడుతూ ముందురోజు జరిగిన సంఘటన గురించి కొడుకు తనకు చెప్పిందంతా వివరంగా చెప్పాడు. ఆ తరువాత వాడలో ముసలయ్య అన్న మాటలు, అందరూ కలిసి చేసిన తీర్మానం అన్నీ చెప్పాడు.

పార్వతీశం తల మీద ఆకాశం విరిగి పడ్డట్టయింది. ఒక్క నిమిషం మాట్లాడలేక పోయాడు.

"మీ ఇంటి అమ్మాయిని బైట పెట్టాలని కాదయ్యా. కానీ పరిస్థితి అలా తోసుకు వచ్చింది. సత్తె పెమాణికంగా నిజం. పదండిరా పోదాం. బాబు గారు చూసుకుంటారు" అన్నాడు శ్రీనివాసులు వెనక్కి తిరగటానికి సిద్ధపడుతూ.

రాజేశ్వరి ఇక ఆగలేదు. వాకిట్లోకి ఒక్క పరుగున వచ్చింది. తిన్నగా వెళ్ళి నాగరాజు పక్కన నిలబడింది. ఆమెకు ముందు నించీ ఆవేశం ఎక్కువ.

"నాన్నా, నేనితడిని ప్రేమించాను, పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాను."

పార్వతీశం స్పృహలోకి వచ్చాడు.

"నాకేమీ అభ్యంతరం లేదు. హైమవతీ తాంబూలం తీసుకురా." అన్నాడు. హైమవతి మతి పోయింది. ఒకసారి బయట నిలబడిన ఆ జనాలకేసి రాజేశ్వరి కేసి మార్చిమార్చి చూసింది. రాజేశ్వరి తల దించుకుంది. తల్లి భావం ఆమెకు అర్థమయ్యింది.

పార్వతీశం ఉరిమాడు "హైమవతీ, తాంబూలం" ఆయన కోపం చూడటం అందరికీ అదే ప్రథమం. శ్రీనివాసులు ముడుచుకు పొయ్యాడు.

"అయ్యా, మీతో వియ్యమందేటంతటి వాడినా! ఈ రావటం కూడా నాకు ఇష్టం లేదు. కానీ మా పేటలో జనం అడిగి తీరాలని తీర్మానం చేశారు. మీరొక్క సారి మీ అబ్బాయిల్ని మందలిస్తే చాలు."

పద్మావతి కూడా భయపడుతూ అంది "అవునయ్యా. మీ అమ్మాయిని మా ఇంటికి తీసుకు వెళ్ళాలనే ఆశ మాకు లేదు." బిగ్గరగా నవ్వాడు పార్వతీశం.

"మీరు అన్నది నిజమే కావొచ్చమ్మా. కానీ మా అమ్మాయి మీ ఇంటికి రావాలని ఆశ పడింది కదా. పెళ్ళిచేసి పిల్లని గౌరవంగా పంపుతాం. కాకపోతే మేము మర్యాద లేని వాళ్ళం అవుతాం. నేను చెప్పేదొకటి, చేసేదొకటి ఉండదు చెల్లెమ్మా." హైమవతి లోపలనించి తాంబూలం తెచ్చింది.

"రండి బావగారూ, చెల్లెలి పక్కన నుంచోండి. ఇదిగో నేనూ, నా ధర్మపత్ని హైమవతీ మా అమ్మాయి చిరంజీవి సౌభాగ్యవతి రాజేశ్వరిని మీ అబ్బాయి చిరంజీవి నాగరాజుకు ఇచ్చి పెళ్ళి జరిపించటానికి అంగీకరిస్తూ ఇస్తున్న నిశ్చయ తాంబూలం, అందుకోండి." హైమవతి యాంత్రికంగా ఆయనతో కలిసి తాంబూలాన్ని అందిస్తే, శ్రీనివాసులు, అలిమేలు వణికే చేతులతో దాన్ని అందుకున్నారు.

"ఎల్లుండి సప్తమి రోజు మీరు మా ఇంటికి వస్తే పెళ్ళిలో మీ పద్ధతులు, మా పద్ధతులు గురించి వివరంగా మాట్లాడుకుందాం. ముహూర్తాలు పెట్టుకుందాం" వాళ్ళకి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ చెప్పాడు పార్వతీశం. వాళ్ళు భయపడి పోతూ ఒదిగి ఒదిగి దణ్ణాలు పెట్టి నాగరాజుతో సహా వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. యాగీ మొదలు పెట్టిన ముసలాయనకు మాట్లాడటానికి ఏమీ లేక పోయింది. కూడా వచ్చిన ఆ వాడ పెద్ద మనుషులు వాళ్ళతోనే వెళ్ళి పోయారు. ఉచిత వినోదాన్ని అంతసేపు చూసి ఆనందించిన ఇరుగు పొరుగు లోపలకు వెళ్ళి పోయారు. పార్వతీశం బయటకు వెళ్ళాడు.

శయనమ్మగారు, శారదమ్మల నోట మాట లేదు. మగపిల్లలందరు నిశ్శబ్దంగా లోపలకు వెళ్లారు. తానొకటి తలిస్తే, దైవమొకటి తలచిందంటే ఇదే! అప్పటి వరకు శక్తి కూడగట్టుకుని నిలబడ్డ హైమవతి ఒక్క సారిగా కుప్ప కూలిపోయింది. పరిగెత్తుకు వచ్చిన సుశీల, భారతి, హైమవతిని పెద్ద గదిలోకి తీసుకెళ్ళి ఉయ్యాలబల్ల మీద పడుకోబెట్టారు, సుశీల మంచినీళ్లు తెస్తే, భారతి విసనకర్రతో వీచింది. కృష్ణ, సరళ కూడా ఒక్క పరుగున లోపలికి వెళ్లారు.

అందరూ వెళ్ళిపోగానే వరండా వరకు వెళ్లిన రాజేశ్వరి లోపలకు వెళ్ళే ధైర్యం లేక, కదలకుండా ఉన్నచోటే ఉండి కనురెప్పన్నా కొట్టకుండా ఉండిపోయింది. ఆమెను ఎవరూ పలకరించలేదు కూడా. హైమవతి కుప్పకూలి పోవటంతో ఇంట్లో అందరి ధ్యాసా ఆమె మీదే ఉంది.

కొద్ది సేపట్లో ఆవేశం అదుపు చేసుకుని, పార్వతీశంగారు గంభీరంగా లోపలకు వచ్చారు. వస్తూ వస్తూ రాజేశ్వరి వంక ఒక అపరిచితురాలిని చూసినట్లు చూస్తూ వచ్చారు. సరిగ్గా రాజు ముందు ఆగి, "ఏమ్మా, నువ్వడిగితే

ఇంతకన్నా పరువుగా నీ నిశ్చితార్థం జరిపించే వాడిని కానా. ఎందుకు దాచావు నీ ప్రేమ విషయాన్ని నా దగ్గర?" అనేసి జవాబుకోసం చూడకుండా వెళ్ళి పోయాడు పార్వతీశం. అదే ప్రశ్న పదిసార్లన్నా మారు మ్రోగింది రాజేశ్వరి గుండెల్లో. అక్కడే కూలబడి పోయింది. ఆమెకు తన విషయం ఇలా వీధిన పడుతుందన్నది ఊహ కందని విషయం. తల్లి ఆ వాడ వాళ్ళని చూసి తనని చూసినప్పుడే ఆమెకు అర్థమయ్యింది తను బయట కొచ్చి ఎంత పెద్ద పొరపాటు చేసిందో.

ఆ వీధి చివర కొత్తగా వచ్చిన డాక్టరుని పరుగు పరుగున వెళ్ళి పిలుచుకు వచ్చాడు ప్రసాద్. అతను హైమవతిని పరీక్షించి రక్తపోటు ఎక్కువగా ఉందని, పూర్తి విశ్రాంతి అవసరమని, ఆవేశ పడితే పక్షవాతం దాకా పోవచ్చని హెచ్చరించాడు. ఇంట్లో అందరూ భయపడి పోయారు. ఇల్లంతా నిశ్శబ్దం తాండవిస్తోంది. మొదటిసారిగా రాజేశ్వరిని గమనించింది భారతి. గదిలోకి కూడా రాకుండా ముందు వరండాలోనే మోకాళ్ళ మీద తలకాయ ఉంచుకుని శూన్యంలోకి చూస్తూ కూర్చుని ఉందామె.

“మనుషుల మధ్య కులాలు, మతాలు అడ్డుగోడలు కాకూడదని ఆయనే అంటారు. కూతురు తమకులం కానివాడిని ప్రేమించేసరికి, ఆ బోధలన్నీ ఏమయ్యాయో, బాధ పడుతున్నారు" వ్యంగ్యంగా అంది రాజు. భారతి తండ్రి గురించి రాజు అలా అనగానే బాధ పడింది.

"ఇరవయ్యేళ్ళకు పైగా ఆయన పెంపకంలో పెరిగిన నువ్వు ఇదేనా ఆయన్ను అర్థం చేసుకుంది! బాబుగారు నాగరాజు కులంగురించి కాదు బాధ పడింది." సుశీల కల్పించుకుని సర్దిచెప్పబోయింది.

"మరి దేనికో?" వ్యంగ్యంగా అడిగింది రాజేశ్వరి సుశీలని.

"నాగరాజు చదువుకోలేదని, ఇంకా తన కాళ్ళ మీద తాను నిలబడ లేదనీ ఆయనకు తెలుసు. నిన్నెలా పోషిస్తాడు? అది ముఖ్య కారణం. రెండోది నడివీధిలో వాళ్ళు గొడవకు రావటం. ఆయన పరువు గురించి నువ్వు ఒక్కసారైనా ఆలోచించావా? నువ్వు జీవితంతో జూదమాడటానికి సిద్ధపడుతున్నావు. ఇక్కడ మిద్దెలలో, మేడలలో తిరిగిన నువ్వు రేపు హరిజన వాడలో పూరిగుడిసెలో ఇమడగలవా? ఇవన్నీ ఆలోచిస్తే ఆయన నీ మీద కోపంగా ఎందుకున్నారో, మీ అమ్మ ఎందుకు విరుచుకు పడిపోయిందో నీకే తెలుస్తుంది.”

“ఏమోలే, నీకున్నన్ని తెలివి తేటలు నాకెక్కడా? అయితే నేనేమీ కష్టపడనులే అక్కడ. వాళ్ళందరినీ ఎట్లా మార్చాలో నాకు బాగానే తెలుసు." కఠినంగా అంది రాజేశ్వరి.

“తెలిస్తే మంచిదేలే రాజూ”

“ఆలోచించు అక్కయ్యా, నాన్నగారు బాధపడుతున్నారు, కానీ నిన్ను అతనికి ఇవ్వననలేదే!” భారతి నచ్చ చెప్పబోయింది.

"అవును రాజు, చిన్నదైనా భారతి ఆలోచించినట్టు నువ్వు ఆలోచించనే లేదు. పైగా బాబుగారు నిన్ను అడిగిందల్లా ఈ విషయం నువ్వు నాకు ఎందుకు చెప్పలేదమ్మా అనేగా. చెప్పి ఉంటే నలుగురిలో ఆయన పరువు పోయేది కాదుగా."

"ఆయన పరువు పోయేది కాదేమో కానీ నా ప్రేమ పోయేది. నేనతనితో మాట్లాడటం చూసే మనవాళ్ళు అతన్ని కొట్టి వచ్చారు. ఇంక అతన్ని ప్రేమిస్తున్నానని తెలిస్తే నాన్న ఊరుకుంటారా?" రాజు ఉక్రోషంగా అంది.

"మీ అన్నలకు, బాబుగారికి జీవితానుభవంలో ఎంతో తేడా ఉంది. ఆయన చూసిన ప్రపంచాన్ని వీళ్ళెక్కడ చూసారు? ఆయన అనుభవం ముందు వీళ్ళెంత?"

"ఏమో, నాకలా అనిపించింది" పెడసరంగా అంది రాజు. కానీ ఆమె అంతరాత్మ ఆమెను నిలేసింది. అవును, తనసలు ఎందుకు దాచింది ప్రేమ విషయాన్ని? తండ్రి కాదంటాడని భయమా? కులమతాల పట్టింపులు లేవని చెప్పే తండ్రి కాదంటాడని భయపడిందంటే, తను ఏదో తప్పు చేస్తున్నానని అనిపించబట్టేకదా.

భారతి సుశీల వంక ఇంక ఈ విషయం వదిలేద్దామన్నట్లు చూసింది. అర్థం చేసుకుంది సుశీల. ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంది.

★★★★★

మర్నాడు పార్వతీశం పురోహితుడిని పిలిపించి నాగరాజు, రాజేశ్వరుల పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు. మరో పదిహేను రోజులలో ముహూర్తం కుదిరింది. ఆ శుభలేఖను తీసుకుని ఆ మర్నాడు, సప్తమి రోజున చెప్పిన విధంగానే భార్యతో సహా నాగరాజు ఇంటికి వెళ్ళాడు పార్వతీశం. భార్యా భర్తలిద్దరూ కలిసి రావటంతో ఉబ్బి తబ్బిబై పోయారు శ్రీనివాసులు, అలిమేలు మంగ.

"అయ్యో తమరే వచ్చారా? కాకితో కబురు చేస్తే మేమే వచ్చేవారం కదా" అన్నాడు శ్రీనివాసులు. ఇంటి ముందే చేపలను శుభ్రం చేస్తున్న ఆలిమేలు వెంటనే చేతులు కడుక్కుని వచ్చింది పైకి దోపిన చీర కిందకి దింపుకుంటూ. ఆ వాసన, ఇళ్ళ మధ్య పారే మురుగు వాసన, అక్కడి అశుభ్ర వాతావరణం చూసిన హైమవతికి తల తిరగటం

మొదలయ్యింది. రాబోతున్న వాంతిని ఆపుకుంది. మరీ ఇంత అశుభ్రమా? ఇలాంటి చోట రేపు తన ముద్దుబిడ్డ ఉంటుందా?

"అయ్యో, బావగారూ! పిల్ల నిచ్చేవాళ్ళం మేము రావటమే న్యాయం. ఇక ముందు మనకు రాక పోకలు తప్పవు కదా" పార్వతీశం నవ్వుతూ అన్నాడు.

అలిమేలు వచ్చి హైమవతిని ఆదరంగా "లోనకు దయసేయండమ్మా" అంది. హైమవతి ఎటూ తేల్చుకోలేక నిల్చుండి పోయింది. పార్వతీశం ఆమెకు సైగ చేసాడు లోపలకు పదమని. నలుగురూ లోపలకు నడిచారు. మూలనున్న చింకి చాపను పరిచింది అలిమేలు. ఇంట్లో ఉన్న ఒక్కగానొక్క కుర్చీని తెచ్చి, భుజం పైనున్న తుండుతో దులిపి పార్వతీశాన్ని కూర్చోమని సైగ చేసాడు శ్రీనివాసులు. ఆ కుర్చీలో కూర్చుని పార్వతీశం తాను తెచ్చిన శుభలేఖను శ్రీనివాసులుకు ఇచ్చాడు.

"ఇదిగోండి బావగారూ, ఇది శుభలేఖ" దాన్ని అందుకుని అటూ, ఇటూ తిప్పి చూశాడు శ్రీనివాసులు. ఈలోగా లోపలకు వచ్చాడు నాగరాజు. అక్కడ పార్వతీశం, హైమవతమ్మలను చూసి తడబడి చేతులు జోడించాడు. అతన్ని చూసి ప్రాణం లేచొచ్చింది శ్రీనివాసులుకి.

“ఇదిగోరయ్య, బాబుగారు ఇచ్చారు. మీ పెళ్ళి శుభలేఖట" అతని చేతికి ఇచ్చేసాడు తన బాధ్యత తీరినట్లు.

"రేపు మీరు వస్తే పెళ్ళికి కొత్తబట్టలు కొంటాము బాబు. ముహూర్తం పదిహేను రోజులే కదా. చాలా పనులున్నాయి చూసుకోవటానికి. ఇంక వస్తాము." లేచాడు పార్వతీశం. ఎప్పుడెప్పుడా అని చూస్తున్నట్లు తను కూడా లేచింది హైమవతి. వీధి చివరిదాకా వచ్చి సాగనంపారు అలిమేలు, శ్రీనివాసులు.

అక్కడే ఎదురు చూస్తున్న రిక్షానెక్కి ఇంటికి వచ్చేసారు పార్వతీశం, హైమవతి. ఇంటికి వచ్చిన హైమవతి మొహం కందగడ్డలాగా ఉంది. వస్తూనే మంచినీళ్లు తెచ్చిఇచ్చింది భారతి. అవి తాగి పడుకున్న హైమవతి సాయంకాలం వరకు లేవలేక పోయింది. మళ్ళీ రక్తపోటు ఎక్కువయ్యిందామెకు. ఆ సాయంత్రం భారతే తల్లిని కనిపెట్టుకుని ఉంది. ఇంటి పనంతా సుశీల చేసుకుపోయింది. అక్కడ జరిగిన సంగతులన్నీ పార్వతీశంని అడిగి తెలుసుకుంది శయనమ్మగారు. ఆవిడకు హైమవతి మానసిక పరిస్థితి అర్ధం అయ్యింది.

“"రాజూ, అక్కడ ఎలా ఉండగలవే!" కళ్ళు మూసుకుని కలవరిస్తోంది హైమవతి.

"అమ్మాయ్, నీ తల్లిలాంటి దాన్ని, ఒక మాట చెప్తా విను. మనం పిల్లల్ని కనగలం, కానీ వాళ్ళ రాతల్ని కాదు. నువ్వు మానసికంగా నలిగి పోయి, బాబుగారికి మనశ్శాంతి లేకుండా చెయ్యకు. అమ్మాయికి పెళ్ళి అన్న ఆనందం కరువు చెయ్యకు. నీ కర్తవ్యం నువ్వు నిర్వహించు. ఫలితం ఆ దేవుడికి వదిలెయ్యి."

"వాళ్ళ ఇంటికి వెళ్ళి వచ్చాము పిన్నిగారు. ఆ పరిసరాలలో నా బిడ్డ ఎలా ఉంటుంది?" హైమవతికి దుఃఖం ఆగలేదు.

"ఇంత పిచ్చిదాన్ని వయ్యావేంటి అమ్మాయ్? ఈ జీవితం రాజుకోసం నువ్వు ఎంపిక చేసింది కాదు. తనకి తనే ఎంచుకుంది. తప్పదు. అలాగే బ్రతుకుతుంది లేదా బ్రతుకును తీర్చి దిద్దుకుంటుంది. దానికోసం నువ్వు ఆరోగ్యం పాడు చేసుకోవటమేమిటి?"

కుళ్లిపోతున్న హైమ మొహంలో కాస్త వెలుగు వచ్చింది. తల తిప్పి ఆ గదిలోనే ఉన్న రాజు వంక చూసింది. ఏడ్చి ఏడ్చి వాడిపోయిన రాజేశ్వరి మొహాన్ని చూసి తన వద్దకు రమ్మన్నట్లు సైగ చేసింది. రాజు నిదానంగా తల్లి దగ్గరకి వచ్చింది.

"రాజూ, నేను, నాన్న మా చేతుల మీదుగా కన్యాదానం చేసి నిన్ను అలాంటిచోటుకి పంపాల్సి వస్తోంది. ఇది జీవితపర్యంతం నాకు తలచుకున్నప్పుడల్లా దుఃఖాన్నే ఇస్తుంది. చేజేతులా పిల్ల గొంతు కోశామనే దుఃఖాన్నే మిగులుస్తుంది. రాజూ, నిన్ను అల్లారుముద్దుగా పెంచుకున్నాను. నీ పెళ్ళి గురించి ఎన్నో కళలు కన్నాను. కానీ నువ్వు కోరి ఆ ఇంటికి వెళ్తున్నావు. అక్కడ సర్దుకు పోగలిగితే సరే. ఏమన్నా ఇబ్బంది వస్తే మటుకు నీకు నేను అండగా ఉంటానని మరిచి పోకు. ఎటువంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకు, సరేనా? అలాగని నాకు మాటివ్వు." తల్లి మాట్లాడిందే పదివేలనిపించింది రాజుకి. ఒక్కసారిగా పడుకుని ఉన్న తల్లి గుండెలమీద వాలి కరువు తీరా ఏడ్చింది.

"అమ్మా, నువ్వు ధైర్యంగా ఉండు. నేను పిరికిదాన్ని కాదు. నువ్వు గర్వపడేలానే బ్రతుకుతానమ్మా! నీకూ, నాన్నకూ మీ చేతులతో నా గొంతు కోశామనే బాధను నేను కలిగించనమ్మా" ఆమె తల నిమురుతూ ఉండిపోయింది హైమవతి. ఈ సంభాషణనంతా పార్వతీశం విని నిశ్శబ్దంగా అక్కడ నించి వెళ్ళిపోయాడు. భారతి రాజేశ్వరి, తల్లి బాధ పడే తీరు చూసి భగవంతుడీ పరిస్థితిని ఎందుకు తెచ్చాడో అని ఎంతో విచారించింది. రాజేశ్వరి తల్లితో అన్న ఆ ఆఖరి మాటల్లో అంతరార్థం ఉందా అని ఆలోచిస్తూ ఉండిపోయింది.

"బుద్ధి కర్మానుసారిణి" అనుకుంది శయనమ్మ.

★★★★★

ఆ ఆరాత్రి పార్వతీశం గారు బయట నుంచి రాగానే హైమవతి ఆయనకు భోజనం వడ్డిస్తూ అడిగింది.

"రాజుకి మనం కొంత ఆస్తి ఇస్తే?" పార్వతీశం ఆమె కళ్ళల్లోకి లోతుగా చూసాడు ఆమె మనసులో అలోచన కనిపెట్టాలన్నట్లు.

"దాని పెళ్ళికని అట్టిపెట్టిన డబ్బు, చేయించిన నగలు, చీరెలు అన్నీ ఇద్దాం."

"అవి ఎలాగూ ఇస్తాం కదండీ. మరికాస్త ఇద్దామా అని. లేని ఇంట్లోకి వెళ్తోంది కదా?"

"అది కావాలని చేసుకుంటున్న పెళ్ళి ఇది. మనం చూసిన సంబంధం కాదే! పుట్టింటినించి ఆస్తి తీసుకుపోతే, ఆ సంసారం తిన్నగా సాగుతుందా? నా అనుమానాలు నాకున్నాయి. ఇప్పటికే ఇది చదువుకుంది, మన ఇంటినుంచి వెళ్తోంది అంటేనే వాళ్ళు ఒదిగి ఒదిగి ఉంటారు. రాజు స్వభావం నీకు, నాకూ కూడా తెలుసు. పెత్తనం చెలాయిస్తుంది వాళ్ళ మీద. ఇంకా ఆస్తి ఇచ్చి పంపితే చెప్పే పనే లేదు. కొన్నిరోజులాగు. అంతగా అవసరమైతే దాని నగలున్నాయిగా!"

నా బిడ్డకి నగలమ్ముకుని బతకాల్సిన గతి పట్టిస్తారా! అది నేను చూస్తూ ఉండాలా?" దుఖం ఆపుకుంటూ అడిగింది హైమవతి.

"నాకు మటుకూ అది కూతురు కాదా? దానికి ఏ అవసరం వచ్చినా నేను వదిలేస్తానా? అయితే మనం ఉన్నామనే ధీమాతో అది మెట్టినింట్లో చెడ్డ పేరు తెచ్చుకోవటం నాకిష్టం లేదు. ఎప్పటికైనా దాని స్థానం అక్కడే. నువ్వూ, అదీకూడా ఈ విషయం గుర్తుంచుకుంటే దాని కాపురం సవ్యంగా సాగుతుంది. పెళ్ళి అయిపోయాక ఆడపిల్ల అత్తవారింటి పద్ధతులకు, తాహతుకు అలవాటు పడితే పేచీ ఉండదు. పుట్టింటి వాళ్ళు కల్పించుకుంటూ ఉంటే ఆ సంసారం కుదురుగా ఉండదు. నన్నడిగితే, దాని పెళ్ళయ్యాక ఓ రెండు, మూడేళ్లు నువ్వూ దానింటికి ఎక్కువగా పోకు, వాళ్ళనీ ఏ పండుగకో, పబ్బానికో తప్ప పిలువకు. దాని కాపురం విషయాలు తరచి తరచి అడగకు అప్పుడే అది అత్తగారింట్లో కుదురుకుంటుంది. అల్లుడుతో కాకుండా అది ఒక్కతే వస్తే, సాయంత్రానికల్లా దాని ఇంటికి దాన్ని పంపెయ్యి. అది సవ్యంగా కాపురం చేసుకుంటేనే నీకు, నాకు గౌరవం" భోజనం ముగించి లేచాడు పార్వతీశం.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS